క్లుప్తంగా

రిటైర్డ్ పోలీసులకు సత్కారం



విజయవాడస్పోర్ట్స్: క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులు సిబ్బందికి అడ్మిన్ డీసీపీ సరిత శుక్రవారం ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. సీటీఎఫ్ ఏసీపీ ఆర్.రామచంద్రరావు, మాచవరం ఏఎస్ఐ ఎం.వి.రమణ, జగ్గయ్యపేట ఏఎస్ఐ సి.హెచ్. వెంకటేశ్వరరావు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ జె.దుర్గారావు, హోం గార్డులు జి.దుర్గారావు, ఎ.రజినిలను కమిషనర్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ సునీత, హోం గార్డ్స్ ఆర్ఐలు శ్రీనివాసరావు, సుధాకర్‌రెడ్డి, పోలీస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమయ్య పాల్గొన్నారు.

టీటీడీ లడ్డూ ప్రసాదాల విక్రయం



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి లడ్డూప్రసాదాలను భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా పున్నమ్మ తోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం లడ్డూ ప్రసాదాలను విక్రయించారు. టీటీడీ అధికారులు నగరానికి మూడు వేల లడ్డూలను కేటాయించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రసాదాన్ని కొనుగోలు చేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రామాదేవి మాట్లాడుతూ ప్రసాదాల లభ్యతను బట్టి శనివారం, ఆదివారం కూడా విక్రయిస్తామని తెలిపారు. టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకుడు మురళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోమాలసేవ, తులసి అర్చన నిర్వహించారు.

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర నాటకం



విజయవాడ కల్చరల్: జై శబరీషా నాట్యమండలి, భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి సహకారంతో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం ప్రదర్శించిన బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్యహరిశ్చంద్ర నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. నాటకంలో జాషువా రచించిన కాటి సీను పద్యాలను నాటక అభిమానులు ఆసాంతం ఆస్వాదించారు. హరిశ్చంద్రుడినిగా బొర్రా నరేన్ అడవి సీను, అగురు త్రినాథ నాయుడు వారణాసి సీను, తుళ్ళూరు వెంకయ్య కాటిసీను, చంద్రమతిగా ఎస్.సత్యకుమారి, నక్షత్రకునిగా పరదేశ్, తదితరులు నాటకాన్ని రక్తికట్టించారు. కార్యక్రమంలో దొంతాల ప్రకాష్, సింహాచలం నాయుడు, గుమ్మడి జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): 28వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం చెట్ల కొమ్మలను శుక్రవారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ తీగలకు అడ్డంగా మారిన చెట్ల కొమ్మలు తొలగించారు. తొలగించిన చెట్ల కొమ్మలను రోడ్డు పక్కనే వదలివేయటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణారావు ట్రాక్టర్ల ద్వారా చెట్ల కొమ్మలు, వ్యర్థాలను తరలించారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ అండ్ టైలరింగ్, మగ్గం వర్క్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిజం, అసిస్టెంట్ జ్యూట్ క్రాఫ్ట్ ప్రొడక్ట్ మేకర్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మెషిన్ ఎంబ్రాయిడరీ, డ్రెస్ డిజైనింగ్, జామ్, జ్యూస్ తయారు చేయడం, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, హోమ్ క్రాఫ్ట్స్, మిర్రర్ వర్క్, బాతిక్ పెయింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్ మొదలైన కోర్సుల్లో శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నంబరులో కానీ సంప్రదించాలని ఆమె కోరారు.

అంతా మా ఇష్టం

- యథేచ్ఛగా ఆక్రమణలు
- వార్డు సచివాలయానికి కూతవేటు దూరంలో ఆక్రమణలు
- చోద్యం చూస్తున్న అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతా మా ఇష్టం..ఎవరు అడ్డు వస్తారో చూస్తాం..అన్నట్టుంది ఆక్రమణదారుల పరిస్థితి చూస్తుంటే. వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్ జీవీఆర్‌నగర్ ఆచంట వెంకటరత్నంనాయుడు సర్కిల్‌లో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి.

వార్డు సచివాలయం దగ్గరలోనే..

వార్డు సచివాలయానికి కూతవేటు దూరంలో ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోక పోవటం అధికారుల బాధ్యతారాహిత్యాన్ని తెలియ చేస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ సర్కిల్ మీదుగా రామకృష్ణాపురం, దేవీనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, విజయదుర్గానగర్, కేఎల్‌రావు నగర్, బుడమేరు మధ్యకట్ట, మధురానగర్ తదితర ప్రాంతాలకు చెందిన వారు రాకపోకలు సాగిస్తుంటారు.

80 అడుగుల రోడ్డు..40 అడుగులే మిగిలింది

ఇక్కడ మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రోడ్డు ఉండాలి. కానీ ఇక్కడ కేవలం 40 అడుగుల లోపు రోడ్డు మాత్రమే ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్డు పెరగాల్సి ఉండగా ఇప్పుడు ఆక్రమణల వల్ల రోడ్డు విస్తరణకు ఆటంకం ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు. ఇప్పుడే ఆక్రమణలు జరగకుండా చూస్తే రోడ్డు విస్తరణకు ఇబ్బందులు ఉండవని రోడ్డు ఆక్రమించిన తరువాత రోడ్డు విస్తరణసాధ్యం కాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఆచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్‌లో ఆక్రమణలు



యూజీడీ పంపింగ్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన బడ్డీ దుకాణం

రోడ్లను ఆక్రమించి.. దుకాణాలు ఏర్పాటు చేసి..

ఇక్కడ రోజు రోజుకూ చిరు వ్యాపారులు, హాకర్లు వ్యాపారాల కోసం బడ్డీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి కారణంగా రెండు వైపులా రోడ్డు కుచించుకుపోతోంది. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే ఆక్రమణలపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికార పార్టీ నేతల ఒత్తిడితో..

ఇక్కడ ఆక్రమణలకు అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయని, అందువల్లే ఆక్రమణలను అడ్డుకోలేక పోతున్నామని అధికారులు చెబుతున్నారని స్థానికులు అంటున్నారు. అన్ని ప్లాన్‌లతో ఇళ్లు నిర్మించుకుంటే వాలిపోయే అధికారులు ఇక్కడ మాత్రం పట్టించుకోకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోకుంటే రామకృష్ణాపురం, దేవీనగర్ రోడ్డు మాదిరిగా రోడ్డు విస్తరణకు ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది.

యూజీసీ ముసాయిదాను వ్యతిరేకించాలి

ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసే యూజీసీ ముసాయిదాను వ్యతిరేకించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఏఐఎస్ఎఫ్ నగర సమితి ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో యూజీసీ ముసాయిదాను వెనక్కు తీసుకోవాలని కోరుతూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి విద్య కాషాయీకరణ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఉన్నత విద్యను నిర్వీర్యం చేసే విధానాలు అవలంభిస్తోందని విమర్శించారు. వీసీల నియామకం, యూజీసీ నిబంధనలు మార్పు వంటివి ఇష్టారాజ్యంగా చేస్తోందన్నారు. ఫెలోషిప్పులను రద్దు చేసి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. అనుభవం లేని వారిని, తమకు నచ్చిన వారిని వీసీలుగా నియమించి వ్యవస్థను నాశనం చేస్తున్నారని తెలిపారు. యూజీసీ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తోందన్నారు. యూజీసీ చైర్మన్ జగదీష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు, ఉపాధ్యక్షుడు ఎం.సాయి కుమార్, నాయకులు సాధిక్ బాబు, కార్తీక్, రంజిత్, జగదీష్, కార్తీక్, షణ్ముఖ ప్రియ, ప్రవల్లిక, ఖాషాయని, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

రోడ్డుపై గుంతల పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగర పాలక సంస్థ వాటర్ వర్క్స్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ముత్యాలంపాడు, అంబేడ్కర్ కాలనీలో వాటర్ వర్క్స్ పనులలో భాగంగా తవ్విన గోతులను శుక్రవారం పూడ్చించారు. ఇక్కడ వాటర్ పైపులైన్ పనులలో భాగంగా రోడ్డును తవ్వి పనులు పూర్తిచేశారు. అయితే తవ్విన రోడ్లును మాత్రం సరిచేయకుండా తూతూమంత్రంగా మట్టిని పోసి నిర్లక్ష్యంగా వదలివేశారు. దీంతో రాకపోకలకు స్థానికులు పడుతున్న అవస్థలపై 'సాక్షి'దినపత్రికలో శుక్రవారం 'రోడ్డు తవ్వి పూడ్చటం మరిచారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు రోడ్డుపై గుంతలలో డస్ట్‌పోసి సరిచేశారు. అయితే సాక్షి ప్రచురించిన పాటోల ప్రాంతాలలో మాత్రమే డస్ట్ పోసి సరిచేశారు. కానీ పక్కనే మిగిలిన ప్రాంతాలను మాత్రం సరిచేయకపోవటం అధికారుల బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి అక్కడక్కడ తవ్విన ప్రతి గుంతనూ సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



గుంతలు పూడ్చిన దృశ్యం

వాకింగ్‌కు అనుమతి జీవోపై హర్షం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని ప్రభుత్వ కళాశాలు, పాఠశాలల క్రీడామైదానాల్లో వాకింగ్‌కు అనుమతి ఇస్తూ జీఓ జారీ చేయటం సంతోషదాయకమని వాకర్స్‌క్లబ్ ఫాస్ట్‌గవర్నర్, ఐపీడీజీ డాక్టర్ చిన్నం రామకృష్ణ అన్నారు. దుర్గాపురంలో శుక్రవారం సాయంత్రం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను వాకర్స్‌క్లబ్ గవర్నర్‌గా ఉండగా అన్ని ప్రభుత్వ కళాశాలు, పాఠశాలల క్రీడామైదానంలో వాకింగ్‌కు అనుమతి ఇవ్వాలని అప్పటి వాకర్స్‌క్లబ్ నేతలు మురళీమోహనరావు, రావి కృష్ణారావు, కె.సూరిబాబు, జీ మురళీకృష్ణలతో కలిసి సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేశామన్నారు. దీనిపై స్పందించిన చంద్రబాబు అన్ని ప్రభుత్వ కళాశాలు, పాఠశాలల క్రీడామైదానంలో ఉదయం 4గంటల నుంచి 7 గంటల వరకు వాకింగ్ చేసుకోవచ్చంటూ జీఓ జారీ చేశారని హర్షం వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తిపై స్పందించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ డెప్యూటీ గవర్నర్ ఎన్‌బీజీఎం.ప్రసాద్, సయ్యద్‌జాఫర్, వాకర్స్ అదనపు కార్యదర్శి కె.రాము, బీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వాకింగ్‌కు అనుమతి ఇస్తూ జారీ చేసిన జీఓను చూపిస్తున్న చిన్నం రామకృష్ణ

రామకృష్ణకు అభినందనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ కళాశాల, పాఠశాల క్రీడా మైదానాలలో వాకింగ్ చేసేందుకు అనుమతికి కృషి చేసిన అప్పటి వాకర్స్‌క్లబ్ గవర్నర్, ప్రస్తుత పాస్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణకు వాకర్స్ తరుపున వాకర్స్‌క్లబ్ అదనపు క్యాబినెట్ కోశాధికారి డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

వాసవీమాతను దర్శించుకున్న విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆర్య వైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సత్యనారాయణపురంలోని శ్రీ వాసవీమాత ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి రూపాలలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి రూపానికి ఎంతో విశిష్టత ఉందని అన్నారు. వైశ్యుల కులగౌరవం కాపాడడం కోసం అగ్నిప్రవేశంతో ఆత్మత్యాగం చేసిన ఆ తల్లి, వాసవి దేవిగా వైశ్యులకి కులదేవతగా మారిందన్నారు. ఆ చల్లని తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపైన, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లవేళలా ఉండాలని, అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని కాంక్షించారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ శర్వాణి మూర్తి, నాయకులు కొల్లూరు రామకృష్ణ, చల్లా సుధాకర్, మారుతి, సనత్, కాళ్ళ ఆదినారాయణ, కురిటి శివ, బంకా బాబీ తదితరులు ఉన్నారు.



వాసవీమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మల్లాది విష్ణు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): దుర్గా పురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో 11కేవీ ఐనాక్స్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా 1వ తేదీన ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్ర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, బావాజీపేట్, దుర్గాపురం, ఆశ్రమం వీధి, ఐనాక్స్ సినిమా హాల్ ఏరియా, దుర్గి వారి వీధి, సుందరమ్మ వీధి, రాజగోపాలచారి మార్కెట్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఫిజియోథెరపీ శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం స్టార్ ఫిజియోథెరపీ సెంటర్ ఆధ్వర్యాన ఆదివారం గురునానక్ నగర్ గురుద్వార్‌లో ఉచిత ఫిజియోథెరపీ మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ప్రముఖ న్యూరో ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఎం. ప్రభుదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత మెడికల్ క్యాంప్ జరుగుతుందన్నారు. అన్ని రకాల నొప్పులు, న్యూరో సమస్యలకు ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సత్యనారాయపురంలోని స్టార్ ఫిజియోథెరపీ సెంటర్‌లో స్వయంగా కానీ, 83412 74788 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి మహాకుంభాభిషేకం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక మొగల్రాజపురంలోని శ్రీగంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర అర్ధనారీశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్త చెరుకూరు సతీష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వీరుభొట్ల లక్ష్మీ ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర విధానంలో ఈ మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని పేర్కొన్నారు. శనివారం ఉదయం ఈ మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 4 గంటలకు రుద్రహోమం, సాయందీక్షా హోమం, రాత్రి 7 గంటలకు నీరాజన మంత్రపుష్పాలు, బలి హరణ, తీర్థ ప్రసాద వితరణ నిర్వహిస్తామని తెలియజేశారు. 3 తేదీ తుని తపోవనాధీశులు సచ్చిదానంద సరస్వతీ స్వామి హాజరై రుద్రాభిషేకం నిర్వహిస్తారని తెలిపారు. ఈ మహాకుంభాభిషేక మహోత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

యూపీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీలు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): రోగులకు అందుతున్న ఆరోగ్య సేవల పరిశీలనలో భాగంగా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని శుక్రవారం రాజీవ్‌నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రిజిస్టర్‌లు, ఈహెచ్ఆర్ నమోదు, ఔషధాల లభ్యత, ల్యాబ్ పరీక్షలు నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. అదే విధంగా యూపీహెచ్‌సీ పరిధిలో నిర్వహించే డ్రైడే ఫ్రైడేలో పాల్గొని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు ఇళ్లను సందర్శించి వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్‌నగర్ వైద్యాధికారి డాక్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య కార్యక్రమాలను తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

సూపర్ సిక్స్ హామీలను సమాధి చేస్తున్న ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు
- 5న పేద విద్యార్థులకు అండగా 'ఫీజుపోరు'

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడసెంట్రల్): సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం సమాధి చేస్తోందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. విష్ణు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను తూ.చ తప్పకుండా అమలు చేయవలసిన బాధ్యత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై ఉంటుందని, అలా 99.4 శాతం హామీలను అమలు పరిచిన ఘనత రాష్ట్ర చరిత్రలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్య, విజ్ఞప్తులన్నింటికీ.. అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ క్యాలెండర్ ద్వారా వైఎస్ జగన్ మోహహన్ రెడ్డి పరిష్కారం చూపారన్నారు. సంక్షేమ క్యాలెండర్‌ను ప్రదర్శించి నిబద్ధతను చాటుకున్నామన్నారు. కోవిడ్ సమయంలోనూ సంక్షేమాన్ని అమలు పరిచామన్నారు. ఎన్నికల ముందు ప్రజలను నమ్మించి మోసం చేయటం చంద్రబాబు నైజమని మల్లాది విష్ణు విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను గుర్తుచేశారు. రైతులకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసి అన్నదాతను రాజును చేస్తామని.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామంటూ అబద్ధపు హామీలతో బాబు మోసగించారని చెప్పారు. ఉద్యోగం వచ్చేవరకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక హామీల అమలంటే భయమేస్తోందని బాబు మాట్లాడటం సరికాదన్నారు. 8 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన రూ.లక్షా 19 వేల కోట్ల అప్పులపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. జనసేన నేతలకు భూములను ధారాదత్తం చేయడంలో ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ.. పేదల జీవన స్థితిగతులను మెరుగుపర్చడంపై లేకపోవడం బాధాకరమన్నారు. ఈసారి మేనిఫెస్టోను ఏకంగా ప్రజల మైండ్ నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నారని మల్లాది విష్ణు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం విద్యాదీవెన కింద రూ.2,800 కోట్లు, వసతిదీవెన కింద రూ.1100 కోట్ల స్కాలర్ షిప్..రెండూ కలిపి దాదాపు రూ.3,900 కోట్ల బకాయి పడిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అండగా ఫిబ్రవరి 5న వైఎస్సార్ సీపీ 'ఫీజుపోరు' కార్యక్రమాన్ని తలపెట్టినట్లు చెప్పారు. ఆరోజున ప్రతి జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ నేతలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వబోతున్నట్లు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, నాయకులు యరగొర్ల శ్రీరాములు, హఫీజుల్లా, అలంపూర్ విజయ్, జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లాది విష్ణు, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

మధురంగా సాగిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: ఘంటసాల కళాసమితి, శ్రీ లలిత కళాస్రవంతి, విజయవాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలోని వాకర్స్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'పాడుదాం సరదాగా' పేరుతో నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. పీవీఎస్ఎస్ శర్మ, డాక్టర్ దామోదర గణపతిరావు, ఎస్.ప్రసాదరెడ్డి, కొమ్మినేని రత్నకుమారి, డీ పద్మజ, వీ కామేశ్వరి, మల్లాది స్వాతి మధుర గీతాలను ఆలపించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డాక్టర్ దామోదర గణపతిరావు, ఎ.విజయశ్రీ, వడ్డాది కామేశ్వరిలను ఆత్మీయంగా సత్కరించారు. సత్కార కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన రావికృష్ణారావు, అమర్‌నాథ్, గోళ్ళ నారాయణరావు, కే చంద్రమౌళి, బోడి ఆంజనేయరాజు, పాల్గొన్నారు.



చిత్ర గీతాలు పాడుతున్న గాయనీ గాయకులు

సోషల్ మీడియాలో చెడు ప్రచారం

డబ్బులకోసం బెదిరించిన వ్యక్తులపై కేసు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సోషల్ మీడియాలో ఓ వ్యక్తిపై చెడుగా ప్రచారం చేయడమే కాకుండా, డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన కొంతమంది వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరుకు చెందిన పరుచూరి యశ్వంత్ కుమార్ అనే వ్యక్తి మద్రాస్ ఫిల్టర్ కాఫీలో సీహెచ్ కార్తీక్ అనే వ్యక్తితో కలిసి పార్టనర్‌గా పనిచేసేవాడు. అయితే యశ్వంత్‌కు సమయం గడిచిపోవడంతో ఒప్పంద పత్రం ప్రకారం కార్తీక్ ఒక్కడే ఆ షాప్‌ను నడుపుకుంటున్నాడు. దీంతో అక్కడి నుంచి బయటకు వచ్చిన యశ్వంత్.. కార్తీక్‌పై, అతని షాపుపై సోషల్ మీడియాలో చెడుగా ప్రచారం చేసి, తన స్నేహితులతో కలిసి రూ.25 లక్షలు ఇవ్వాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితుడు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ప్రధాన నిందితుడైన పరుచూరి యశ్వంత్ కుమార్, అతని అనుచరులైన చైతన్య కోసూరి, బొల్లా ఎస్ఎన్‌వీ కృష్ణారావు, గిరిమోహన్, పరుచూరి శివకుమార్, దేవరపల్లి హనుమంతరావు, గండిబోయిన చైతన్యవర్మ, సాయి ప్రసాద్, నరేష్, కుర్రి రాజు, మేల్ రాజేంద్రరెడ్డి, ఉంగరపు సాయికుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

7 నుంచి హాస్య నాటికల పోటీలు

విజయవాడ కల్చరల్: సుమధుర కళానికేతన్ 51వ వార్షికోత్సవం, 27వ హాస్యనాటికల పోటీకి ప్రదర్శించే హాస్యనాటికల వివరాలను సుమధర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి పసుమర్తి భాస్కరశర్మ, కార్యనిర్వాహక కార్యదర్శి పిండిప్రోలు సూర్యనారాయణమూర్తి వెల్లడించారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. భాస్కరశర్మ మాట్లాడుతూ మూడురోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో వీడేం మగాడండీ బాబు (కళాంజలి సంస్థ హైదరాబాద్), వర్క్ ఫ్రం హోమ్(సహృదయ ద్రోణాదుల), దంతవేదాంతం (ఈవీఎస్ కళా సమితి విజయవాడ), మా ఇంట్లో మహాభారతం (మద్దుకూరి క్రియేషన్స్ చిలకలూరిపేట), దొందూ దొందే (భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం), ప్రేమ పిచ్చి (యంగ్ థియేటర్స్ విజయవాడ), ఆవేశంలో ఆనందం (మల్లాది క్రియేషన్స్, హైదరాబాద్) వారి నాటికలను ప్రదర్శనలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. పిండిప్రోలు సూర్యనారాయణ మాట్లాడుతూ యువ కళాకారులను ప్రోత్సహిస్తూ సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు లఘునాటికలు, సంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.



నాటికల వివరాలను వెల్లడిస్తున్న పసుమర్తి భాస్కర శర్మ, పక్కన సూర్యనారాయణ మూర్తి

వన్‌మాన్ కమిషన్ చైర్మన్ పర్యటన

పటమట(విజయవాడతూర్పు): ఎస్సీ సబ్ క్లాసిఫికేషన్ రిజర్వేషన్ విధానాల ప్రయోజనాలు సమానంగా పంపిణీ చేయడానికి సిఫార్సులను సూచించేందుకు ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా (వన్‌మాన్) కమిషన్ చైర్మన్ శుక్రవారం పటమటలో పర్యటించింది. ఈ మేరకు ఆయన శుక్రవారం విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి పటమట పంటకాల్వ రోడ్డులోని రెల్లీస్ కాలనీ ప్రజలను, అంగన్‌వాడీ, హైస్కూల్, స్వయం సహాయక బృందాల జీవనోపాధిని పరిశీలించారు. వీరిద్దరూ రెల్లీస్ కాలనీలో ఎస్సీ ప్రజలు నివసిస్తున్న ఇళ్లను, చేస్తున్న వృత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ స్కూల్ పిల్లలు వాళ్లకు అందిస్తున్న పోషకాహారాలు,ఎత్తు బరువు, వసతులు పరిశీలించారు. స్వయం సహాయక బృందమైన సాయినాథ గ్రూప్ తయారు చేసిన ఉత్పత్తులను, వాటి ద్వారా వారికి కలుగుతున్న ఆర్థిక అభివృద్ధి, ప్రభుత్వం వారికి కల్పిస్తున్న రుణ సదుపాయం వంటి విషయాలను పరిశీలించారు. పటమట బాలుర జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధాన ఉపాధ్యాయురాలితో మాట్లాడి చదువుతున్న ఎస్సీ పిల్లల జనాభా, వారి పురోగతి, వారికి కల్పిస్తున్న భోజన వసతులు తెలుసుకున్నారు. 9వ తరగతి పిల్లలతో వారు చదువుతున్న పాఠ్యాంశాన్ని చెప్పమని వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం,అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపీనాయక్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.